సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



పీలేరులో బంగారు, నగదు చోరీ

బంగారు, నగదు చోరీకి గురైన సంఘటన పీలేరు పట్టణం కావలిపల్లెలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. - 8లో



సోదరుడి కుమార్తె నిశ్చితార్థానికి వెళుతూ..

సోదరుడి కుమార్తె నిశ్చితార్థానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 211 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	451	552
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 856.50 కిలోలు

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో ప్రవేశాలకు గడువు పెంపు

మదనపల్లె సిటీ: జిల్లాలోని కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు ఈనెల 30 వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తెలిపారు. జిల్లాలోని కేజీబీవీల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో బాలికల ప్రవేశానికి, 7,8,9 తరగతుల్లో మిగిలిన ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పీలేరు - చెన్నై ఆర్టీసీ బస్సు సర్వీసు



పీలేరురూరల్ : ప్రయాణికుల సౌకర్యం కోసం సోమవారం నుంచి పీలేరు - చెన్నై మధ్య ఆర్టీసీ బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు నుంచి తిరుపతి, పుత్తూరు, పిచ్చాటూరు, నాగలాపురం, ఊతుకోట, పెరియపాళెం మీదుగా చెన్నైకి నేరుగా బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నామన్నారు. పీలేరు నుంచి ప్రతి రోజు ఉదయం 6 గంటలకు బయలుదేరి 11.45 గంటలకు చెన్నైలో మాధవరం బస్‌స్టేషన్‌కు చేరుతుందన్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి సాయంత్రం 6.15 గంటలకు పీలేరు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు దిశ కమిటీ సమావేశం

రాయచోటి : రాజంపేట ఎంపీ, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ పి.వి.మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం దిశ కమిటీ (జిల్లా అభివృద్ధి సహకార, పర్యవేక్షణ కమిటీ) సమావేశం జరుగుతుందని దిశ కమిటీ కన్వీనర్, కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమీక్షకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



చిన్నమండెం పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధరరావు

చిన్నమండెం : చిన్నమండెం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం స్టేషన్ ఆవరణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

చిరు ధాన్యం.. సిరి భాగ్యం

కాలానికి అనుగుణంగా మనుషుల ఆహారపు అలవాట్లలో మార్పు కనిపిస్తోంది. తళతళ మెరుస్తూ.. ఘుమఘుమలాడుతూ.. ముక్కుపుటాలు అదిరేలా కల్తీ పంట నూనెలతో తయారయ్యే ఆహార పదార్థాలతో కలిగే అనర్థాలను తెలుసుకుని జనం చిరుధాన్యాల ఆహారం వైపు అడుగులు వేస్తున్నారు. ఫలితంగా చిరుధాన్యాల సాగుపై రైతులు మక్కువ పెంచుతున్నారు.

- చిరుధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి
- తక్కువ ఖర్చు, నీరు.. ఎక్కువ దిగుబడులు
- మార్కెట్‌లో చిరుధాన్యాలకు అధిక డిమాండ్
- జిల్లాలో ఖరీఫ్‌లో 1200, రబీలో 320 ఎకరాలలో సాగు
- ఖరీఫ్‌లో 3500 ఎకరాలు సాగు లక్ష్యంగా సన్నాహాలు
- చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం





రాయచోటి ప్రాంతంలో సాగులో ఉన్న చిరుధాన్యాల పంటలు

రాయచోటి : చిరుధాన్యాల విలువేంటో సమాజానికి ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది. కొర్రల పాయసం, రాగి జావ వంటి వంటకాలు జనాల నాలుకల మీద రుచుల నాట్యం చేస్తున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటకు సార్థకత చేకూరుతోంది. ఉన్నది తిన్నామో..! గంజే తాగామో..! అని మాట వరుసకు అంటుంటాం. పేదల తిండి అని చెప్పడానికి వాడే ఉపమానం అది. నిజానికది గరీబు తిండి కాదు, నిఖార్సయిన తిండి.. నిండైన తిండి.. గంభీరమైన తిండి... శ్రీమంతుల తిండి.. ఇంకా చెప్పాలంటే చిరుధాన్యాలకు మించిన పౌష్టికాహారం ఈ భూమండలం మీదే ఉండదు. అందుకే ఒకప్పటి పచ్చజొన్నల గట్క మళ్లీ రారమ్మని పిలుస్తోంది. ఆనాటి రాగిజావ తిరిగి కళ్ల ముందు కదలాడుతోంది. నేడు టీ దుకాణాలలో సైతం చిరుధాన్యాల జావాలకు పెద్ద డిమాండ్ ఉంది. కనుమరుగైన సామపాశం మళ్లీ సాహో అంటోంది. మచ్చుకైనా కనిపించని సజ్జ మలీదలు మిర్రిమిర్రి చూస్తున్నాయి. ఈ తరానికే తెలియని నూనె పోలెలు సన్నగా కవ్విస్తున్నాయి. ప్రాభవం కోల్పోయిన చిరుధాన్యాలు చిరునవ్వులు రువ్వుతున్నాయి. చిరుధాన్యాల సాగుతో రైతుకు సిరులు కురవనున్నాయి. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించి అధిక లాభాలను ఆర్జించవచ్చు.

జిల్లాలో చిరుధాన్యాల సాగు

అన్నమయ్య జిల్లాలోని నేలలు కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదల పంటల సాగుకు అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అతి తక్కువ వర్షపాతం నమోదైనా పంట చేతికొస్తుందని పేర్కొంటున్నారు. చిరుధాన్యాల సాగుపై అధిక శాతం రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెడితే 8–10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో రూ.60 నుంచి రూ.70 వరకు ధర పలుకుతుండగా, క్వింటాలుకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు వస్తుంది. అంటే ఎకరాకు దాదాపు రూ.70 వేలకు పైగా ఆదాయం సమకూరనుంది. రైతుల్లో అవగాహన పెంచి జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచేలా వ్యవసాయ శాఖ కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సైతం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. తేలికపాటి నేలల్లో అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో కొర్ర పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో 1,520 ఎకరాలలో జొన్న, రాగులు, కొర్రలు, సజ్జలు సాగు జరుగుతుంది. 7 రకాల చిరుధాన్యాలు ఉండగా వాటిలో జొన్న, రాగులు, కొర్రలు అక్కడక్కడ సామలు పండిస్తున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో ఈ రబీలో 320 ఎకరాలలో చిరుధాన్యాలు సాగు చేశారు. జిల్లాలో అదనంగా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచడానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

20 గుంటల పొలంలో కొర్రసాగు



20 గుంటల పొలంలో కొర్రసాగు చేస్తున్నా. మా చిన్నతనంలో మా పెద్దలు మాకు కొర్ర అన్నం పెట్టేవాళ్లు. అందుకోసం కొర్రసాగు చేయాలనుకున్నాను. ఇతర పంటల కన్నా ఈ పంటల సాగులో మంచి లాభాలున్నాయి. మార్కెట్‌లో కిలో కొర్రలు రూ.80–రూ.90కి అడుగుతున్నారు. తక్కువ పెట్టుబడి, శ్రమ కూడా తక్కువగానే ఉంటుంది. పంట దిగుబడి బాగా ఉంటే మంచి లాభాలే వస్తాయి.

– రామిరెడ్డి, రైతు, చెన్నముక్కపల్లి, రాయచోటి మండలం

రాగి పంట సాగు చేశా



ఒక ఎకరాలో రాగి పంట సాగు చేశాను. ఈ పంటకు మంచి గిరాకీ కూడా ఉంది. మార్కెట్‌లో ఎప్పుడైనా ధర పలుకుతాయి. ఆరోగ్యానికి మంచిదని చాలా మంది ఇంటి దగ్గరకే వచ్చి కొర్రలు, సజ్జలను విడిగా కొనుక్కుని వెళ్తున్నారు.

– రెడ్డిప్రసాద్‌రెడ్డి, రాగి రైతు, చెన్నముక్కపల్లె, రాయచోటి మండలం

3,500 ఎకరాలకు సాగు పెంపు



అన్నమయ్య జిల్లా పరిధిలో సుమారు 1520 ఎకరాలలో పలు రకాల ధాన్యం పంటలు సాగు చేస్తున్నారు. రాగులు, జొన్న, సజ్జలు, కొర్రలు అధికంగా పండిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంది. రైతులకు అవగాహన కల్పించి జిల్లాలో ఈ ధాన్యాల సాగు విస్తీర్ణం 3500 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

– ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, అన్నమయ్య జిల్లా

చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్



మన పూర్వీకులంతా ఆరోగ్యంగా ఉండటానికి కారణం వారు కష్టపడి పనిచేసేవారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేవారు. ప్రస్తుతం సమాజంలో మనిషికి శారీరక కష్టం పూర్తిగా తగ్గిపోయింది. నాజూకైన తిండికి అలవాటు వలన అనారోగ్యాల పాలవుతున్నారు. తృణధాన్యాల సాగు తక్కువ పెట్టుబడితో చేపట్టవచ్చు. అలాగే తక్కువ నీటి వినియోగంతో ఈ పంటలు పండుతాయి. ధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తుంది. పంటల సాగులో ఎప్పటికప్పుడు రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నాం. వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల కన్నా చిరుధాన్యాల సాగులోనే మంచి దిగుబడులు, లాభాలు పొందవచ్చు.

– గిరీషా పీఎస్, అన్నమయ్య జిల్లా కలెక్టర్

పట్టాలు తప్పిన విధులు

- లోకోపైలెట్లకు విశ్రాంతి లేకుండా విధి నిర్వహణ
- బలవంతంగా ఎర్రగుంట్లకు తరలింపు
- ఏకపక్ష నిర్ణయాలపై కార్మికవర్గాల్లో తీవ్ర వ్యతిరేకత
- రైల్వేబోర్డు పునరాలోచించాలని కార్మిక కుటుంబాల డిమాండ్



ముంబై–చెన్నై రైలుమార్గంలో నడిచే గూడ్స్‌రైలు

రాజంపేట: తెల్లదొరల కాలం నుంచి నందలూరు రైల్వే కేంద్రంలో కొనసాగుతున్న రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ నుంచి లోకో పైలెట్ల విధులు ఇప్పుడు పట్టాలు తప్పుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అధిక పనిగంటలతో లోకో పైలెట్లతో రైళ్లను నడిపిస్తున్నారు. విశ్రాంతి లేకుండా పరుగులు తీయిస్తున్నారు. ప్రస్తుతం నందలూరు డిపో పరిధిలో గార్డులు 20 మంది, 60 మంది డ్రైవర్లు, 80 మంది అసిస్టెంట్ డ్రైవర్లు ఉన్నారు.

అసౌకర్యాల నడుమ కొత్తడిపో..

ఎర్రగుంట్లలో కొత్తగా ఏర్పాటు చేసిన డిపో అసౌకర్యాల మధ్య నడుస్తోందని లోకోపైలెట్లు, గార్డులు, ఏఎల్‌పీలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సరైన క్వార్టర్స్ లేవు. కాలుష్యబెడద, తాగునీటి సమస్యతో సతమతమవుతున్నామంటున్నారు. అక్కడ పనిచేసేందుకు చాలామంది సిబ్బంది విముఖత చూపుతున్నారు. డివిజన్ స్థాయి అధికారుల ఒత్తిడితో 20 మంది డ్రైవర్లు, 20 మంది అసిస్టెంట్ డ్రైవర్లు, 16 మంది గార్డులను కొత్తడిపోకు తీసుకెళ్లారు.

డివిజన్‌స్థాయి ఉన్నతాధికారి వైఖరిపై ఆరోపణలు

గుంతకల్‌లో పనిచేస్తున్న ప్రొద్దుటూరుకు చెందిన ఓ డివిజన్ స్థాయి ఉన్నతాధికారి నిర్ణయాలే ఈ పరిస్థితికి కారణమని రైల్వేకార్మికవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం వల్ల రన్నింగ్‌స్టాఫ్ మానసికంగా బాధపడుతున్నారు.

కార్మికసంఘాలతో చర్చించకుండానే..

రైల్వేకార్మికులు, ఉద్యోగులకు సంబంధించి పీఎన్‌ఎం మీటింగ్‌లు నిర్వహించి, కార్మిక సంఘాల నేతలతో చర్చించి నిర్ణయాలు తీసుకునేవారు. ఇప్పుడు గుంతకల్ డివిజన్‌లో ఆ పరిస్థితులు మృగ్యమయ్యాయి. రాబోయే రోజుల్లో కార్మిక సంఘాల మనుగడ ప్రశ్నార్థకమేనని కార్మిక వర్గాలు ఘోషిస్తున్నాయి.

16 నుంచి 20 గంటల పాటు విధులు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా మీదుగా రైలు మార్గంలో నిత్యం 50 గూడ్స్ రైళ్లు పరుగులు తీస్తుంటాయి. లోకో పైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్, గార్డు కలిసి గూడ్స్‌రైలులో నందలూరు నుంచి కృష్ణపట్నం చేరుకుంటారు. అక్కడ 8గంటల విశ్రాంతి తీసుకొని మళ్లీ గూడ్స్ రైలులో నందలూరుకు రావాలి. కానీ వారిని కొత్తడిపో ఎర్రగుంట్ల వరకు వెళ్లాలని బలవంతంగా తీసుకెళతారు. అక్కడ 8 గంటల విశ్రాంతి తీసుకుని మళ్లీ గూడ్స్ రైలును నందలూరుకు తీసుకురావాలి. ఇలా 16 నుంచి 20 గంటల పాటు రన్నింగ్‌స్టాఫ్‌తో డ్యూటీ చేయిస్తున్నారు. దీనిపై ప్రశ్నించే నాథుడు కరవయ్యాడనే విమర్శలున్నాయి.

ఉన్నతాధికారుల నిర్ణయాలే నందలూరుకు శాపం



డివిజన్ ఉన్నతాధికారుల నిర్ణయాలే నందలూరు రైల్వే కేంద్రం నిర్వీర్యానికి శాపాలుగా మారాయి. ఏ అధికారి వస్తే ఆ అధికారి తమ స్వప్రయోజనాల కోసం నందలూరును టార్గెట్ చేసుకొని నిర్ణయాలు తీసుకుంటున్నారు.

–ఎముక దుర్గయ్య, ఆల్విన్ కార్మిక మాజీనేత, నందలూరు

బీజేపీ పాలనలో నందలూరు రైల్వే సర్వనాశనం



బీజేపీ పాలనలో నందలూరు రైల్వేకేంద్రం సర్వనాశనమైంది. దీన్ని గ్రామీణ స్టేషన్‌గా మార్చేస్తున్నారు. రైల్వేబోర్డు స్వయంగా దృష్టి సారించాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది.

–షేక్ నవాబ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీనేత, నందలూరు

హార్సిలీహిల్స్ అడవిలో మొక్కలపై పరిశోధన



హార్సిలీహిల్స్‌పై సేకరించిన మొక్కల కొమ్మలను విశ్లేషించుకొంటున్న పరిశోధకులు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ అడవిలో ఆదివారం తిరుపతి ఎస్‌వీయూకు చెందిన పరిశోధక విద్యార్థులు మొక్కలపై పరిశోధనలు నిర్వహించారు. దట్టమైన, వివిధ జాతులకు చెందిన మొక్కలు, వృక్షాలకు ఈ కొండ పెట్టింది పేరు. గతంలో అంతరించిన ఓ మొక్కను కూడా ఇక్కడే కనిపెట్టారు. ఇందులో భాగంగా మొక్కశాస్త్ర పరిశోధకులు మిట్టా మహేంద్రనాథ్, మధుసుధాకర్, వృక్షశాస్త్ర విద్యార్థి మహేష్ ఈ పరిశోధనకు వచ్చారు. వీరు ఆదివారం పగలంతా అడవిలో మొక్కలను పరిశీలించారు. కొన్ని మొక్కల కొమ్మలను తీసుకొచ్చి వాటి గుణగణాలను శోధించి వివరాలను నమోదు చేశారు. ఈ మొక్కల గురించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్టు మిట్టా మహేంద్రనాథ్ చెప్పారు.

'స్పాట్' పారితోషికం పెంపు

- మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం
- జీఓ విడుదల
- ఉపాధ్యాయుల హర్షం



మూల్యాంకన కేంద్రంలో సమాధాన పత్రాలను పరిశీలిస్తున్న పది పరీక్షల అబ్జర్వర్ వెంకటకృష్ణారెడ్డి (ఫైల్)

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షల నిర్వహణను ప్రభుత్వ యంత్రాంగం ఒక యజ్ఞంలా భావిస్తుంది. పది పరీక్షల నిర్వహణ, అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనం వరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తారు. ఈ విధుల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, ఉపాధ్యాయులకు పారితోషికం (రెన్యుమరేషన్) ఇస్తారు. అయితే పెరిగిన ఖర్చుల మేరకు రెన్యుమరేషన్ పెంచాలని డిమాండ్ కొన్నేళ్ల నుంచి వస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు కూడా ప్రభుత్వానికి విన్నవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీఓ 37 విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం పదో తరగతి పరీక్షలు, జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొనే ఉపాధ్యాయులు, అధికారుల రెన్యుమరేషన్ పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

ఈ ఏడాది నుంచే అమలు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచే పెరిగిన రెన్యుమరేషన్‌ను అమలు చేయనున్నారు. పది పరీక్షల నిర్వహణలో పేపర్ సెట్టర్స్, ట్రాన్స్‌లేటర్స్, మోడరేటర్, సీఎస్, డీఓలు, ఇన్విజిలేటర్లు, క్లర్క్స్, అటెండర్స్, వాటర్‌మెన్స్, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, వైద్య సిబ్బంది, జిల్లా స్థాయి పరిశీలకులు పాల్గొంటారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనంలో క్యాంప్ ఆఫీసర్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్, (స్ట్రాంగ్‌రూము), (అడ్మినిస్ట్రేషన్), అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్, స్పెషల్, అసిసెంట్లు, క్లరికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సబార్డినేట్లు, ఎగ్జామినర్స్ ఫర్ ప్రిపేరింగ్ ప్రిన్సిపల్ ఆఫ్ వాల్యుయేషన్‌లు పాల్గొంటారు. వీరికే కాకుండా కంటింజెన్సీకి కూడా నిధులు పెంచారు. జిల్లాలో సుమారు 600 మంది సిబ్బంది పాల్గొన్నారు. వీరిందరికి పెరిగిన పారితోషికం వర్తిస్తుంది .

పెరిగిన పారితోషికం ఇలా..

కేటగిరి	ప్రస్తుతం ఇస్తున్నది (రూ. రోజుకు)	పెరిగినది (రూ.రోజుకు)
పేపర్ సెట్టర్(ప్రతిపేపరుకు)	రూ.880	రూ.1,320
ట్రాన్స్‌లేటర్ (ప్రతిపేపరుకు)	రూ.770	రూ.1,155
మోడరేటర్(ప్రతి పేపరుకు)	రూ.770	రూ.1,155
చీఫ్ సూపరింటెండెంట్	రూ.44	రూ.66
డీఓ. ఏడీఓ	రూ.44	రూ.66
ఇన్విజిలేటర్	రూ.22	రూ.33
క్లర్క్	రూ.22	రూ.33
అటెండర్	రూ.13.20	రూ.20
వాటర్‌మెన్	రూ.11	రూ.17
సిట్టింగ్ స్క్వాడ్	రూ.44	రూ.66
వైద్య సిబ్బంది	రూ.22	రూ.33
జిల్లా స్థాయి పరిశీలకులు	రూ.200	రూ.300
మూల్యాంకనంలో పాల్గొనేవారికి....		
క్యాంప్ ఆఫీసర్	రూ.385	రూ.578
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు	రూ.330	రూ.495
అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు	రూ.286	రూ.429
చీఫ్ ఎగ్జామినర్ (రోజుకు)	రూ.264	రూ.396
ఏఈలు(ప్రతి పేపరుకు)	రూ.6.60	రూ.10
స్పెషల్ అసిస్టెంట్లు	రూ.137.50	రూ.300
క్లరికల్ అసిస్టెంట్లు	రూ.88	రూ.132
ఆఫీస్ సబార్డినేట్స్	రూ.55	రూ.83
చీఫ్ కోడింగ్ ఆఫీసర్	రూ.220	రూ.330
సహాయ కోడింగ్ ఆఫీసర్	రూ.198	రూ.297
ప్రిన్సిపల్స్ ఆఫ్ వ్యాల్యుయేషన్	రూ.250	రూ.375

శుభ పరిణామం



సుమారు ఏడేళ్ల అనంతరం ప్రభుత్వం రెన్యుమరేషన్ పెంచడం శుభ పరిణామం. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉంది.

-డి.మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు.

ఆశాజనకం



సమకాలీనంగా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం రెన్యుమరేషన్ పెంపుదల చేయడం అభినందనీయం. విద్యాక్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులకు అధిక నిధులు వెచ్చించడం కూడా ఆశాజనక పరిణామం.

-సి.రాజారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

కొంత ప్రయోజనమే



ప్రభుత్వం స్పాట్ వాల్యుయేషన్ పెంచిన రెన్యుమరేషన్ కొంత వరకు ప్రయోజనకరంగా ఉంది. ఓపెన్‌స్కూల్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం రెన్యుమరేషన్‌తో సమానంగా పెంచి ఉంటే మరింత ప్రయోజనకరంగా ఉండేది.

-పి.మధుసూధన్, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కలెక్టరేట్‌లో నేడు స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా జరిగే స్పందనలో ప్రజలు అర్జీలు సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పరవాండ్లపల్లికి చెందిన గడ్డపార అప్పిరెడ్డి భార్య లక్ష్మీదేవి (33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె ఊరి సమీపంలోని బావిలో శవమై తేలింది. ఆ సమయంలో తాను ట్రాక్టర్ నడిపేందుకు వెళ్లానని, బావి వద్దకు నీళ్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లు భర్త పేర్కొన్నాడు. అయితే కట్టుకున్న భర్తే చంపి బావిలో పడేసినట్లు మృతురాలి అన్న మంజునాథ్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం కేసు నమోదు చేసిన పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

మదనపల్లె : స్థల వివాదంలో జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. గోళ్లపల్లెకు చెందిన పి.మారెప్ప(40), తన సమీప బంధువైన పెద్దకోనప్పకు స్థల వివాదం కొంతకాలంగా నడుస్తోంది. ఈక్రమంలో ఆదివారం స్థలం వద్ద పనులు చేస్తుండగా, కోనప్ప తన కుమారుడు వెంకటరమణ, రెడ్డెప్ప, శివలతో కలిసి మారెప్పతో గొడవకు దిగాడు. ఇరువర్గాల మధ్య కర్రలతో జరిగిన గొడవలో మారెప్ప, పెద్దకోనప్ప కుమారుడు వెంకటరమణ(37) తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను కొత్తకోట ఆస్పత్రికి తరలించగా, చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పెన్నా నదిలో యువకుడి మృతి

జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు రహదారిలో ఉన్న పెన్నానదిలో ఈత కోసం వెళ్లి సూరజ్ (23) అనే యువకుడు మృతి చెందాడు. అర్బన్ సీఐ సదాశివయ్య ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌కు చెందిన సూరజ్ ముగ్గురు స్నేహితులతో కలిసి గండికోటకు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో స్నేహితులు వారిస్తున్నా వినకుండా.. పెన్నానదిలో ఈత కొట్టాలంటూ పెన్నానది లోనికి దిగాడు. నీరు ఎక్కువగా ఉండటంతో కొట్టుకునిపోయాడు. స్నేహితులు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో.. మైలవరం గ్రామం నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు. వారు రాత్రి 8 గంటల సమయంలో మృతదేహం బయటికి తీశారు. మృతుడు టైర్ల కంపెనీలో గుమస్తాగా విధులు నిర్వహిస్తుండే వాడు.

వైభవోపేతంగా అక్షయ తదియ


చెన్నకేశవస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ


పూలంగి సేవలో చెన్నకేశవ స్వామి


నంది వాహనంపై వైద్యనాథేశ్వరస్వామి

- ఘనంగా పుష్పగిరి బ్రహ్మోత్సవాలు
- స్వాములకు ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగిన అక్షయ తదియ ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఎండ తీవ్రత ఎక్కువగా వుండడం కారణంగా పగటి పూట భక్తుల సంఖ్య కొంత తక్కువగానే వున్నప్పటికీ.. సాయంత్రం నుంచి భక్తుల రాక పెరుగుతూ రాత్రికి భారీగా పెరిగింది. పంచ నదీ సంగమమైన పుష్పగిరిలోని పెన్నా నదిలో సంకల్పపూర్వకంగా స్నానం చేసి అక్షయ తదియ రోజున శివ, కేశవులను భక్తితో పూజిస్తే అశ్వమేధయాగం చేసిన ఫలితం దక్కుతుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. దీంతో అధిక సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు చెన్నకేశవ స్వామి ఎదుట తడి బట్టలతో సాష్టాంగ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యం లభిస్తుందనే ప్రగాఢ విశ్వాసంతో అనేక మంది భక్తులు బ్రాహ్మణుల ఆధ్వర్యంలో తమ పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు.

కమనీయంగా చెన్నకేశవుని పూలంగి సేవ

శ్రీ చెన్నకేశవ స్వామికి పూలంగి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు ధరింప చేసి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ముల్లోకాల లోని సకల తీర్థాలతో పూరింపబడిన శంఖం, దైత్య నాశనాన్ని కోరే గధ, దుష్ట శక్తులను అంతమొందించే సుదర్శన చక్రాలను ధరించి అభయ హస్తంతో భక్తులను ఆశీర్వదిస్తున్నట్లున్న స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్యనాథునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మహేశ్వర రెడ్డి, పురోహితులు సుమంత్ దీక్షితులు, రాజేశ్వర శర్మ, ఉభయదారులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

అక్షయ తదియ ఉత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి శ్రీ వైద్యనాథ స్వామిని, కామాక్షీ మాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామిని కలసి ఆయన ఆశీస్సులను పొందారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్, కమలాపురం నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ సమన్వయకర్త దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలు శ్రీ వైద్య నాథేశ్వరస్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

ఇష్ట వాహనాలపై హరి హరులు

రాత్రి శ్రీ చెన్నకేశవస్వామి తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వాములు తమకు ఇష్టమైన నంది వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు ట్రాక్టర్ల యజమానులు, ఆటోల యజమానులు వల్లూరు నుంచి పుష్పగిరి వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. వివిధ కుల సంఘాలు, వివిధ గ్రామాల వారి ఆధ్వర్యంలో భారీగా అన్నదానం చేశారు. అరవ చెన్నారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు. పలువురు దాతలు భక్తులకు దాహార్తిని తీర్చడానికై మినరల్ వాటర్‌ను, శీతల పానీయాలను, పానకంలను, మజ్జిగను పంపిణీ చేశారు. పలువురు దాతల ఆధ్వర్యంలో చెక్క భజనలు, హరికథా కాలక్షేపాలను ఏర్పాటు చేశారు.

నేడు కల్యాణోత్సవాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాములకు ముత్యాల తలంబ్రాలతో కల్యాణ మహోత్సవం జరుగుతుంది. సాయంత్రం శ్రీలక్ష్మీ చెన్న కేశవస్వామికి శ్రీదేవి, భూదేవితో ముత్యాల తలంబ్రాల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారికి ఊంజల్ సేవ జరుగుతుంది.

కడప జట్టు ఘన విజయం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్ మెన్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు ఘన విజయం సాధించింది. ఆదివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.జహీర్ అబ్బాస్ 40 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో చెలరేగి 93 పరుగులు చేశాడు. ఈయనకు జతగా పవన్‌కుమార్‌రెడ్డి 30 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ మాధవ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. జట్టులోని పృధ్వీరాజ్ 61 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ధరణికుమార్ 26 పరుగులు చేశాడు. కడప బౌలర్ సుదర్శన్ 2 వికెట్లు తీశాడు. దీంతో కడప జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది.

నెల్లూరు జట్టు జయకేతనం

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. జట్టులోని ఎం.కె. రెడ్డి 64 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సుదర్శన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. జట్టులోని గిరినాథ్ 35, కమ్రుద్దీన్ 31 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు మాధవ్ 2, సల్మాన్ 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 4 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

వల్లూరు : పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్షయ తదియను పురస్కరించుకుని భారతి సిమెంట్ పరిశ్రమ సౌజన్యంతో.. ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో ఏర్పాటు చేసిన ఓల్డ్ కేటగిరీ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి, పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి, మాజీ జెడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, భారతి సిమెంట్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ సాయి రమేష్ ప్రారంభించారు. వీరు మొదట కోర్టు ప్రవేశ ద్వారం వద్ద రిబ్బన్ కట్ చేసి కోర్టులోకి ప్రవేశించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్షిణ కాశిగా పేరొందిన పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు విశేష ప్రాధాన్యత వుందని అన్నారు. ఇందులో భాగంగా భారతి సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో రైతులను ప్రోత్సహించే విధంగా బండలాగుడు పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో వుంచుకుని రాత్రి సమయంలో ఆహ్లాదకర వాతావరణంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో పోటీలను ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 11 జతల ఎద్దులు హాజరయ్యాయి. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను తిలకించడానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ పరిశ్రమ వీపీ మల్లారెడ్డి, ఐఆర్ అండ్ పీఆర్ చీఫ్ మేనేజర్ భార్గవరెడ్డి, మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ ఏ ప్రతాప్‌రెడ్డి, డీజీఎమ్ మల్లికార్జునరెడ్డి, నరేందర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, యర్రగుడిపాడు చెన్న కేశవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి


పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, భారతి సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు

సోదరుడి కుమార్తె నిశ్చితార్థానికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి
- భర్త, పిల్లలకు గాయాలు


మృతి చెందిన కాంతమ్మ

మదనపల్లె : సోదరుడి కుమార్తె నిశ్చితార్థానికి ద్విచక్ర వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా.. భర్త, పిల్లలు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ సిద్దేవారిపల్లెకు చెందిన సిద్దే చంద్రమోహన్‌నాయుడు, ఎస్.కాంతమ్మ భార్యాభర్తలు. వీరికి జనార్థన్‌నాయుడు, నరేష్‌నాయుడు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కొంత కాలం నుంచి ఉపాధి నిమిత్తం మదనపల్లె మండలంలోని కోళ్లబైలు పంచాయతీ వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆదివారం పోతపోలు పంచాయతీ పాళెంకొండలో బంధువుల నిశ్చితార్థానికి వెళ్లేందుకు భార్య, కుమారులతో కలిసి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గంమధ్యలో తట్టివారిపల్లె జంక్షన్ వద్ద వెనుకవేపు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో వాహనం అదుపుతప్పి కాంతమ్మ టిప్పర్ కింద పడిపోయింది. మిగిలిన ముగ్గురు మరో వైపు పడ్డారు. కాంతమ్మపై టిప్పర్ వెళ్లడంతో ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు బాధితులను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కాంతమ్మ(42) మృతి చెందింది. భర్త చంద్రమోహన్‌నాయుడు(47), కుమారులు జనార్థన్‌నాయుడు(14), నరేష్‌నాయుడు(12) స్వల్పగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం కాంతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సోదరుడి కుమార్తె నిశ్చితార్థ వేడుకలకు వెళుతుండగా ప్రమాదం జరిగి కాంతమ్మ మృతి చెందడంతో కార్యక్రమం వాయిదా పడింది. బంధువులు, కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని విలపించారు. బాధిత కుటుంబంలో విషాదం నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

లక్కిరెడ్డిపల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆదివారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. లక్కిరెడ్డిపల్లి చింతకుంటపల్లి మార్గంమధ్యలోని చర్చి వద్ద బైక్ ఢీకొనడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. లక్కిరెడ్డిపల్లి నుంచి నిఖిల్ కాలినడకతో చింతకుంటపల్లెలోని తమ ఇంటికి వెళ్తుండగా వేంపల్లి వైపు నుంచి వస్తున్న స్కూటర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

ఆటో బోల్తా పడి..

మదనపల్లె : ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది. పీటీఎం మండలం రాపూరివారిపల్లెకు చెందిన కాయలవాండ్లపల్లెకు చెందిన కె.సుబ్బన్న(58) రంగసముద్రం నుంచి బి.కొత్తకోటకు ప్యాసింజర్ ఆటోలో బయలుదేరాడు. మార్గంమధ్యలో బి.కొత్తకోటకు సమీపంలో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో సుబ్బన్న తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పీలేరులో బంగారు, నగదు చోరీ


తెరిచి ఉన్న బీరువా తలుపులు

పీలేరు రూరల్ : బంగారు, నగదు చోరీకి గురైన సంఘటన పీలేరు పట్టణం కావలిపల్లెలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. స్థానిక కావలిపల్లెలో నివాసం ఉంటున్న హబీబ్ బాషా కుటుంబ సభ్యులు శనివారం రాత్రి రంజాన్ పండుగ సందర్భంగా భోజనానంతరం కుటుంబ సభ్యులు కొందరు ఇంటి వరండా, మరికొందరు ఇంటిలో నిద్రకు ఉపక్రమించారు. దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువా తలుపులు బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు బీరువాలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.లక్ష నగదు, ఐదు తులాల బంగారు ఆభరణలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

26 నుంచి గంధ మహోత్సవం


నంద్యాలంపేటలోని దర్గా

మైదుకూరు : మైదుకూరు మండలం నంద్యాలంపేటలో ఈ నెల 26 నుంచి గంధ మహోత్సవం నిర్వహించనున్నారు. 26న నిషాన్, 27న గంధ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని మాతృశ్రీ ఆశ్రమంలో హజరత్ అష్రఫే దోజహో ఆరా మాసాహేబా కుడిచి, హజరత్ జహూర్ అలీషా ఖాద్రీచిష్టి వారి దర్గాలు వెలిసి ఉన్నవి. ఆ మహనీయుల కృపతో దీనజనుల దీర్ఘకాలిక రోగాలు, మానసిక బాధలు తదితరాలు తొలగిపోతున్నాయని భక్తుల నమ్మకం. మాసాహేబా కుడిచివారి గంధం శోభకృత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ సప్తమి ఈ నెల 27న గురువారం ఉదయం జీవీ సత్రంలోని పఠాన్‌ఖాన్ ఇంటి నుంచి బయలుదేరుతుంది. మాసాహేబా కుడిచి, గౌస్‌లాజం దస్తగిరి, అలిముష్కిల్‌కుషా స్వాములకు సమర్పిస్తారు. జహూర్ అలీషా ఖాద్రీచిష్టి 2016 ఏప్రిల్ 27న సమాధి నిష్టాగరిష్టులైనారు. ఆ మహనీయుడు భక్తుల కోరికలు తీరుస్తూ.. వారిని రక్షిస్తున్నారు. ఆయన గంధం శోభకృత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ సప్తమి ఈ నెల 27న గురువారం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రొద్దుటూరుకు చెందిన జహూర్ అలీషా ఖాద్రీచిష్టి కుమారులు, ఖాదర్‌పల్లెకు చెందిన మహబూబ్ హుసేన్ కుమారులు, జీవి సత్రానికి చెందిన పఠాన్ సత్తార్ ఖాన్, దొరసానిపల్లెకు చెందిన వుండేల రామభూపాల్‌రెడ్డి కోరారు.

సిద్దవటం కోటలో పర్యాటకుల సందడి


సిద్దవటం కోటకు వచ్చిన పర్యాటకులు


పెన్నా నదిలో ఈత కొడుతున్న ముస్లింలు

సిద్దవటం : సిద్దవటంలోని మట్లి రాజుల కోటలో పర్యాటకులు ఆదివారం రంజాన్ పండుగ సందర్భంగా రెండో రోజు వేడుకలు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో 40 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు శనివారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నలుమూలల నుంచి ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి సిద్దవటంలోని మట్లి రాజుల కోటలో బాసికుద్బా వేడుకలు చేశారు. అనంతరం వెంట తెచ్చుకున్న భోజనాన్ని ఆరగించారు. పెన్నానదిలో కోటలోని స్వరంగ మార్గం గుండా వెళ్లి చిన్నా, పెద్ద, మహిళలు పెన్నా నీటిలో ఈతలాడుతూ కేరింతలు కొట్టి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

కుట్టుమిషన్‌ల పేరుతో కుచ్చుటోపీ

- టైలరింగ్ శిక్షణ అంటూ ప్రలోభాలు
- రూ.2 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు


మాట్లాడుతున్న ఎంజీ పురం మహిళలు

రాజంపేట రూరల్ : మహిళలకు కుట్టుమిషన్‌ల పేరుతో రూరల్ కింగ్ డమ్ డెవలప్‌మెంట్(ఆర్‌కేడీ) ఆర్గనైజేషన్ చైర్మన్, తాడిపత్రికి చెందిన రాధాకృష్ణ కుచ్చుటోపీ పెట్టారు. ఇందుకోసం ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. నిరుద్యోగులకు వల వేసి మెరుగైన జీతాలు ఇస్తానని ఆశ చూపి 2020లో జిల్లాకు ఒక మేనేజర్‌ను నియమించారు. అదే విధంగా మండలానికి ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. అక్కడ నుంచి వారి ప్రలోభాల పర్వం కొనసాగించారు. ముందుగా జిల్లా మేనేజర్, సూపర్ వైజర్‌లు ఒక గ్రామంను ఎంచుకొని కుట్టుమిషన్ నేర్చుకున్న మహిళల వివరాలు కనుక్కొని, వారికి మాయమాటలు చెప్పి నమ్మించారు. మీ గ్రామంలో ఒక చోట కుట్టు మిషన్ శిక్షణ సెంటర్ ఏర్పాటు చేస్తామని నమ్మబలికారు. అందులో శిక్షకురాలిగా నీవే ఉండు, నెలకు రూ.8 వేల జీతం ఇస్తామని ఆశ చూపారు. సెంటర్ ఏర్పాటుకు అద్దె రూ.1000 నుంచి 1500 చెల్లిస్తామని ఒప్పించారు. మీరు చేయవలిసిందల్లా కేవలం 120 మంది సభ్యులను చేర్పించడమేనని చెప్పారు. వారు కేవలం ఒక్కొక్కరు రూ.600 చెల్లిస్తే వారికి నాలుగు నెలలు శిక్షణ ఇస్తామని, 4 నెలల అనంతరం ప్రతి ఒక్క సభ్యురాలికి ఒక కుట్టు మిషన్ అందజేస్తాని ఆశ చూపారు. గ్రామంలో మహిళలకు సాయం చేసినట్టు ఉంటుంది, తమకు లబ్ధి చేకూరుతుందని ఆ మహిళ.. 120 సభ్యుల వద్ద రూ.600 చొప్పున రూ.72 వేలు నగదు తీసుకొని ఆర్గనైజేషన్ వారికి చెల్లించారు. శిక్షణ సమయంలో అద్దె చెల్లించక, జీతాలు ఇవ్వక, కుట్టు మిషన్‌లు 2020 నుంచి ఇప్పటికీ ఇవ్వక పోవడంతో ఆ మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఆ విధగా రాజంపేట మండలంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 15 చోట్ల సెంటర్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్‌లో 5 కుట్టు మిషన్‌లు ఏర్పాటు చేశారు. రోజులో ఒక గంటకు 15 మంది సభ్యులకు శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఈ విధంగా మండలంలో రూ.10,80,000 వసూలు చేశారు. ఈ విషయాన్ని మండల పరిదిలోని ఎంజీ పురం సెంటర్ సభ్యులు ఆదివారం విలేకర్ల దృష్టికి తీసుకొచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఒక రాజంపేట మండలంలోనే కాక జిల్లా స్థాయిలో ఈ ఆర్గనైజేషన్ 260 పైగా సెంటర్‌లను ఏర్పాటు చేసి దాదాపు రూ.2 కోట్లకు పైగా వసూలు చేసినట్లు వారు ఆరోపించారు. ఇదే విషయంపై జిల్లా మేనేజర్ పరుశురాంను వివరణ కోరగా కొన్ని చోట్ల అద్దెలు చెల్లించాలని, కొందరు శిక్షకులకు జీతాలు చెల్లించాలని తెలియజేశారు. జూన్ మాసం చివరికల్లా సభ్యులందరికీ కుట్టు మిషన్‌లు పంపిణీ చేయడంతోపాటు జీతాలు, అద్దెలు చెల్లిస్తామని తెలియజేశారు.